క్లుప్తంగా

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఎచ్చెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు బుధవారం ధర్నా చేపట్టారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చే విధానం నిలుపుదల చేయాలన్నారు. ఈ మీటర్లు కార్మికులు, సామాన్యులకు ఉరితాళ్లుగా భవిష్యత్తులో మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు సైతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో ప్రభుత్వం దోపిడీకి తెరతీసిందని విమర్శించారు. రాయితీలు ఎత్తివేసి ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బంగార్రాజు, శ్రీనివాసరావు, సురేష్, గోవింద కుమార్ పాల్గొన్నారు.

టీఎల్ఎం ఆవిష్కరణ



టీఎల్ఎం అవిష్కరిస్తున్న చేస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని అధ్వాన్నంపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న డాక్టర్ కూర్మాన అరుణకుమారి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తయారు చేసి టీఎల్ఎంలను బుధవారం ఎంఈవో ముళ్ల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అరుణకుమారి తెలుగు వర్ణమాలలో ప్రతీ అక్షరంతో నాలుగు పదాలను చిత్రాలతో సహా అద్భుతంగా చిత్రించి తయారు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఇటువంటి టీఎల్ఎంను తయారు చేసి విద్యార్థులకు అర్థమైనరీతిలో పాఠాలను బోధించడంతో ఆమెకు ఎవరూ సాటిలేరన్నారు. ఇటీవల ఆన్‌లైన్‌లో ఉమెన్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా నిర్వహించిన ఉమెన్ ఐకాన్ 2024 అవార్డును కైవసం చేసుకున్నారని గుర్తు చేశారు. అనంతరం ఆమెను పలువురు అభినందించారు.


మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



కొమరవానిపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జనార్ధన

గార: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్ఐ ఆర్.జనార్ధన సూచించారు. మండలంలోని తోనంగి, బచ్చువానిపేట, కొర్లాం, కొమరవానిపేట గ్రామాల్లో సంకల్పం పేరిట అవగాహన సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం తీసుకోవడం వలన అనారోగ్యంతో పాటు ఆర్థికపరమైన నష్టాలు తప్పవన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే గంటలోగా సమాచారాన్ని పోలీసులకు లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.


విజేతలకు అభినందనలు



విద్యార్థులతో డీసీవో బాలాజీ నాయక్

శ్రీకాకుళం రూరల్: ఎచ్చెర్లలో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన పెదపాడు బాలికల అంబేడ్కర్ గురుకులానికి సంబంధించిన విద్యార్థినులను డీసీవో బాలాజీ నాయక్ అభినందించారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కుడా ప్రతిభ కనబర్చాలన్నారు. ఇటీవల కాలంలో క్రీడలు ద్వారానే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని, అలాంటప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: యువత గంజాయిని సేవించరాదని, అలాగే ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా నగరంలోని పుణ్యపువీధిలో ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తతతో ఉండాలని సూచించారు.

సమస్యల కూత..!

- జి.సిగడాం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు
- రైళ్లు ఎక్కడానికి నానా అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ముందు నిలుపుదల చేసిన గూడ్స్ రైలు



రైలు కింద నుంచి వెళ్తున్న ప్రయాణికులు

జి.సిగడాం: జి.సిగడాం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల ఈ స్టేషన్ అభివృద్ధి చేసినా సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. ఈ స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మొదటి ఫ్లాట్ ఫారం నుంచి కాకుండా మధ్యలో ఉంటుంది. ఇక్కడ పాసింజర్, పూరీ–తిరుపతి రైళ్లు నిలుపుదల చేస్తున్నారు. అయితే ఈ రైళ్లు వచ్చే సమయంలో స్టేషన్ అవరణలో గూడ్స్, ఇతర రైళ్లు అడ్డుగా ఉంటుండడంతో ప్రయాణికులు రైలు ఎక్కడానికి నరకయాతన పడుతున్నారు. ఉత్తర – దక్షిణ రెండువైపులా రైళ్లు కొన్ని రోజుల పాటు ఈ స్టేషన్‌లో నిలుపుదల చేస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి మధ్యలో ఉండడంతో దానిపై నుంచి వెళ్లడానికి అవ్వడు. అందువలన అగిన రైళ్ల కింద నుంచి ప్రమాదకరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

తప్పని తిప్పలు

ఎస్పీఆర్‌పురం, చెట్టుపొదిలాం, మధుపాం, దేవరవలస, కప్పరాం, నల్లిపేట, వెలగాడ, చంద్రయ్యపేట, నడిమివలస, సేతు భీమవరం, పెనసాం, గంగన్నదొపాలెం, ఎందువ, గెడ్డ కంచరాం, నర్సింహపురం, గదబపాలెం గ్రామాల ప్రజలు దక్షిణ వైపు నుంచి స్టేషన్‌కు వస్తారు. అలాగే జి.సిగడాం, పొగిరి, పెంట, మర్రివలస, నాగులవలస, సీతంపేట, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం, సంతవురిటి, టీడీవలస, అధ్వాన్నంపేట, వెంకయ్యపేట, జాడ, జగన్నాథవలస, గొబ్బూరు గ్రామాల నుంచి ఉత్తర వైపు నుంచి ప్రయాణికులు వస్తారు. అయితే వీరందరూ రైళ్లు ఎక్కడానికి వెళ్లే సమయంలో మధ్యలో పలు రైళ్లు నిలుపుదల చేయడంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలా రైళ్లు అడ్డంగా నిలుపుదల చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఈ స్టేషన్‌లో రెండు పాసింజర్లు నిలుపుదల చేస్తారు. అవి వచ్చిన సమయంలో మధ్యలో వేరే రైలు నిలుపుదల చేస్తారు. దీంతో మేము ఎక్కాల్సిన రైలు ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతెనపై నుంచి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– కంది సాయికిరణ్, యువకుడు, ఎస్పీఆర్‌పురం

నానా పాట్లు పడుతున్నాం



మేము విశాఖ లేదా పలాస వెళ్లడానికి కుటుంబ సభ్యులతో కలిసి రైలు ఎక్కడానికి వస్తాం. అయితే ఆ సమయంలో ఇరువైపులా వేరే రైలు ఉంటుండడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ ఏదో ఒకవైపు నుంచి మొదట్లో పాసింజర్ నిలుపుదల చేస్తే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– తొత్తడి రామారావు, పెనసాం, జి.సిగడాం

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



రైల్వే ప్రయాణికుల కోసం ప్రభుత్వం సరైన సౌకర్యాలు ఏర్పాటు కల్పించాలి. పాసింజర్ వస్తున్న సమయంలో ఏదో ఒక గూడ్స్ రైలు మధ్యలో పెట్టడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

– పేడాడ శ్రీరామ్మూర్తి, దవళపేట

ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ



జరజాం వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మహిళా సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఐదో రోజులు పాటు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షకుల శిక్షణ బుధవారంతో ముగిసింది. 340 మందికి విడతలు వారీగా 100 మందికి చొప్పున శిక్షణ ఇస్తున్నారు. గురువారం నుంచి రెండో విడత శిక్షణ నిర్వహించనున్నారు. చివరి రోజు జరజాంలో క్షేత్రస్థాయి శిక్షణ, ముగింపు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ అధికారి శ్రీరాంకుమార్ ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి రైతులు అలవాటు పడాలని ఆకాంక్షించారు. పశువుల ఎరువులు, ఆవులు ఆధార ఎరువులు, వర్మీ కంపోస్టు వంటి వాటికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి, అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కోష్టలో సంకల్ప ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సూచించారు. మండలంలోని కోష్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు.. మీ జీవితాన్ని బలి చేసుకోవద్దు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. పరసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు, ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సమాజంలో పోలీసుల పాత్రపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళ పోలీసు బమ్మిడి అమ్మోజీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు




మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలతో జీవితంలో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఎచ్చెర్ల ఎంపీపీ, ఎచ్చెర్ల మండల బాల్య వివాహాల నియంత్రణ కమిటీ అధ్యక్షుడు మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నియంత్రణ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. బాలికల తల్లిదండ్రులు విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఎచ్చెర్ల ప్రాజెక్టు ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి కొత్తకోట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అరుణ, శరణ్య, అంగన్‌వాడీ వర్కర్లు శారద, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



పెద్ద మందిరంలో సంగీత విభావరి



హయాతీనగరంలో దీపారాధనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు సత్యసాయి మందిరాల్లో సత్యసాయి 99వ జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. పెద్ద మందిరంలో యువతచే నామ సంకీర్తన, గాయకులు పి.నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీతో సంగీత విభావరి జరిగింది. కార్యక్రమంలో ఇంజినీర్ డోల తిరుమలరావు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, కన్వీనర్ మురళీకృష్ణ, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. హయాతీనగంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న జయంతి ఉత్సవాల్లో భాగంగా దీపారాధనలు జరిగాయి. కార్యక్రమంలో మందిరం సభ్యులు పాల్గొన్నారు. అలాగే న్యూకాలనీ సత్యసాయి మందిరంలో దివ్య పల్లకీ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా సాయి భక్తులు మేళతాళాలతో బాబావారి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. మహిళలు దీపారాధనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌వీ గురుప్రసాద్, గుప్తా, రామారావు, జి.ప్రమీలారాణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శత కలశ పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో జరుగుతున్న ఆరాట్టు ఉత్సవాల్లో భాగంగా బుధవారం శత కలశ పుజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకర నారాయణశర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శత కలశాలకు ఆలయ ధర్మకర్త రెడ్డి చిరంజీవులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఎచ్చెర్ల, ఎస్ఎంపురం పంచాయతీల పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

100 రోజుల పని కల్పించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలకు 100 రోజులు పని కల్పించే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏపీవో ఎస్.శోభాదేవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలల వారీగా పనులు కల్పించాల్సి ఉంటుందన్నారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులు క్రమ పద్ధతిలో చేయాలని సూచించారు.

సుమిత్రమ్మ మృతి తీరనిలోటు



శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక (తెరవే) సభ్యురాలు, రచయిత్రి, తెలుగు పండిట్ అయ్యగారి సుమిత్రమ్మ మృతి సాహిత్య లోకానికి తీరనిలోటని తెరవే అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వందలాది సంప్రదాయ కవితలను రాశారని, విమర్శకురాలిగా కూడా అందెవేసిన చేయని అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

25 నుంచి మహా కుంభాభిషేకం మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొడెమ్మ కోవెలలో వేంచేసిన ఉమా జీవేశ్వరాలయంలో ఈనెల 25 నుంచి 30 వరకు కార్తీక మాసం సందర్భంగా శివ పంచాయతన సహిత రుద్రయాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. సహస్ర లింగార్చనలు, హోమాలు, గణపతి కల్యాణం, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, సూర్యనారాయణ స్వామి కల్యాణం, 29న 1100 కలశాలతో శిఖరానికి మహా కుంభాభిషేకాలు, అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఉలకరు.. 'పలక'రు!



రిమ్స్ ఆస్పత్రి రోడ్డులో బలగ నుంచి హడ్కోకాలనీకి వెళ్లే కూడలిలో పలకలు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పాడైన పలకల స్థానంలో వేసేందుకు పలకలు తయారు చేసి నెల రోజులైనా ఇప్పటి వరకు అమర్చకుండా వదిలేశారు. దీంతో ఈ కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

రోడ్డు అధ్వానం



గార సీఎస్పీ రోడ్డు నుంచి కొత్తూరు–పైరిగాం వెళ్లే బీటీ రోడ్డు రాళ్లుతేరి అధ్వానంగా మారింది. ఆ గ్రామానికి వెళ్లేందుకు ఈ ఒక్క రోడ్డే ఆధారం. 1.6 కిలోమీటర్లు ఉండే రోడ్డులో పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవ్వడంతో పాటు పంక్చర్లు అవుతున్నాయి. అందువలన అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– గార

డ్రోన్‌తో నిఘా



బహిరంగంగా మద్యం తాగి అలజడులు సృష్టించడం, మారుమూల నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్నవారిపై నిఘా పెట్టేందుకు ఉపయోగించే డ్రోన్ కెమెరా సర్వీసును వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం వినియోగించారు. అనుమానిత ప్రాంతాలైన డచ్ బంగ్లా, దమ్మల వీధి, కంద్రి వీధి, కంపోస్టు కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, వాంబేకాలనీ, మంగువారితోట, గుజరాతీపేట పాత బ్రిడ్జి పరిసరాలు, నదీ పరివాహక ప్రాంతాలతో పాటు పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ ఫ్లై చేయించారు. ఎవరైనా పట్టుబడిన ట్లెతై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– శ్రీకాకుళం క్రైమ్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులతో సివిల్ జడ్జి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు ఆకాంక్షించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బొందిలిపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల చదువు సమయంలోనే సమాజాన్ని తెలుసుకోవాలని సూచించారు. మంచి విద్యా బుద్ధులు, నడవడిక నేర్చుకోవాలన్నారు. పాఠశాలలో పిల్లలపై శ్రద్ధ చూపించి బాధ్యతాయుతంగా చదువు నేర్పించాలని ఉపాధ్యాయులకు స్వీట్స్ అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, హెచ్ఎం బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అనాథకి ఆశ్రయం



గోవింద్‌ను నైట్ షెల్టర్‌లో చేర్పిస్తున్న ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హయాతీ నగరానికి చెందిన నిస్సహాయ వృద్ధుడు, గూడులేక నిరాశ్రయుడైన శిల్లా గోవింద్‌ను గొంటివీధిలో ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన వ్యవస్థ (నైట్ షెల్టర్)లో ఆశ్రయం కల్పించారు. నగరంలోని మార్కెట్ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న షాపుల మెట్లపై రాత్రిపూట పడుకుంటూ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానంతో పొట్ట నింపుకుంటున్న గోవింద్ కోసం తెలుసుకున్న ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, ఉర్లాం శివతేజలు గోవింద్‌కు సపర్యలు చేసి ఆశ్రయానికి చేర్చారు. వీరితో పాటు జిల్ ఫౌండేషన్ ప్రతినిధి జాడ సాయి, పొడుగు చరణ్‌లు ఉన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



శ్రీకాకుళం అర్బన్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గ్రంథాలయాలతో విజ్ఞాన సమూపార్జన సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం అన్ని మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాలలో ఘనంగా నిర్వహించారు. వారం రోజులపాటు విద్యార్థులకు, పాఠకులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. చివరి రోజు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు



శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థికి బహుమతి అందజేస్తున్న పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ



శ్రీకాకుళం అర్బన్: బలగ శాఖ గ్రంథాలయంలో...



గారలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పుస్తక ప్రదర్శన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు ఈ ప్రదర్శన ప్రారంభించారు. లైబ్రేరియన్ సురేందర్ పుస్తకాల ప్రాధాన్యత వివరించారు. గ్రంథాలయంలో పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.